నేడే నామినేషన్ల దాఖలుకు ఆఖరు

- అఫిడవిట్‌లు సమర్పించని 87 మందికి నోటీసులు
- ఇప్పటివరకు 2,700పైగా నామినేషన్ల నమోదు

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ దాఖలుకు శుక్రవారం గడువు ముగియనున్నది. ఇప్పటివరకు 2,700 మందికి పైగా అభ్యర్థులు నామినేషన్లు నమోదు చేశారు. ఈ నెల 8 వరకు 1,345 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, ఇందులో రెండు సార్లు నామినేషన్లు వేసిన వారు 157 మంది ఉన్నట్టు ఎన్నికల సంఘం గుర్తించింది. మొత్తం మీద 8 వరకు 1,188 మంది నామినేషన్లు దాఖలు చేయగా, వీటిలో 87 మంది అభ్యర్థులు అఫిడవిట్ సమర్పించలేదని రిటర్నింగ్ అధికారులు (ఆర్‌వో) వెల్లడించారు. వీరితో పాటు అఫిడవిట్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలని వారికి అధికారులు నోటీసులు జారీ చేశారు.

తేదీల వారీగా దాఖలైన నామినేషన్లు

నవంబర్ 3	96
నవంబర్ 4	139
నవంబర్ 6	211
నవంబర్ 7	281
నవంబర్ 8	618
మొత్తం	1345

ఇబ్రహీంపట్నంలో ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు

గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్తను పరామర్శిస్తున్న రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

బీఆర్ఎస్ ర్యాలీపై కాంగ్రెస్ రాళ్లదాడి

- నామినేషన్ల సందర్భంగా ఇబ్రహీంపట్నంలో ఘటన
- 36మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, నలుగురు పోలీసులకు గాయాలు
- బాధ్యులపై చర్యలు తప్పవన్న సీపీ చౌహాన్

ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నం రూరల్, నవంబర్ 9: నామినేషన్ల వేళ కాంగ్రెస్ బరితెగించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ ర్యాలీపై రాళ్లదాడికి దిగింది. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డికి ఉదయం 10.30 గంటలకు, బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డికి మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3 గంటల వరకు పోలీసులు సమయం కేటాయించారు. పార్టీ కార్యాలయం నుంచి మంచిరెడ్డి తన అనుచరులు, కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ చౌరస్తాకు ర్యాలీగా బయలుదేరారు. మరోవైపు, బొంగుళూరు వైపు నుంచి మల్‌రెడ్డి భారీ కాన్వాయ్‌తో ఇబ్రహీంపట్నం బయలుదేరారు. ర్యాలీలు రెండూ బస్‌డిపో వద్ద ఎదురుపడడంతో ఘర్షణ వాతావరణం తలెత్తింది. కాంగ్రెస్ ర్యాలీలోని కొందరు బీఆర్ఎస్ ర్యాలీపై వాటర్ బాటిళ్లు విసిరి, రాళ్ల దాడికి దిగడంతో 36 మంది గాయపడ్డారు. నలుగురు పోలీసులు కూడా గాయపడ్డారు. కొందరి తలలు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని సమీపంలోని దవాఖానకు తరలించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన సీపీ డీఎస్ చౌహాన్ అదనపు బలగాలను రప్పించి ఆందోళనకారులను చెదరగొట్టారు. నామినేషన్ అనంతరం మల్‌రెడ్డిని వేరే వాహనంలో తరలించగా, మంచిరెడ్డి ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఇబ్రహీంపట్నంలో జరిగిన రాళ్లదాడి ఘటనపై విచారణ జరుపుతున్నామని, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. సీసీకెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

రాళ్లదాడిలో తీవ్రంగా గాయపడిన ఇబ్రహీంపట్నం కానిస్టేబుల్

లోకం పోకడ

మీ సత్తా చూపెట్టాల్సింది బూతుల్లో కాదు, పోలింగ్ బూతుల్లో !

చెన్నూర్‌లో కాంగ్రెస్ దౌర్జన్యం

చెన్నూర్, నవంబర్ 9: చెన్నూర్‌లో నామినేషన్ల సందర్భంగా గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయ సమీపంలో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్, కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ నామినేషన్ వేసేందుకు ఒకే సమయానికి వచ్చారు. ఈ సమయంలో వివేక్ వెంట వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ శ్రేణులను రెచ్చ గొట్టేలా నినాదాలు చేశారు. సహనం పాటించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి వారికి పోటీగా నినాదాలు చేశారు. దీంతో ఇరు పార్టీల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. పోలీసులు వచ్చి ఇరు పార్టీల వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.

వర్షకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	34.5°c	19.6°c
ఆదిలాబాద్	34.5°c	18.0°c
రంగారెడ్డి	32.8°c	19.3°c
మెదక్	32.8°c	19.3°c
నిజామాబాద్	32.1°c	21.9°c
కరీంనగర్	32.0°c	22.0°c
ఖమ్మం	32.0°c	21.0°c
వరంగల్	31.0°c	23.0°c
హైదరాబాద్	30.8°c	21.8°c
మహబూబ్‌నగర్	30.0°c	22.1°c

పండుగలా బీఆర్ఎస్ నామినేషన్లు

- 109 మంది నామినేషన్లు సమర్పణ
- మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు మంత్రుల నామినేషన్
- బైక్ ర్యాలీలు, భారీ బహిరంగ సభలు
- అంబులెన్స్‌లో వచ్చిన దుబ్బాక అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

హైదరాబాద్/సిద్దిపేట, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అభ్యర్థులు పెద్దఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. ఏకాదశి మంచి రోజు కావడంతో గురువారం 109 మంది నామినేషన్లు వేశారు. అభ్యర్థులు ఉదయాన్నే దేవాలయాల్లో పూజలు చేశారు. నియోజకవర్గ కేంద్రాలు ర్యాలీలు, గులాబీ జెండాలు, పార్టీ క్యాడర్‌తో కళకళలాడాయి. మిగిలిన అభ్యర్థులు శుక్రవారం నామినేషన్లు వేయనున్నారు.

నామినేషన్ దాఖలు చేసిన ప్రముఖులు వీరే..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సిరిసిల్లలో, మంత్రి టీ హరీశ్‌రావు సిద్దిపేటలో నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ నేతలు, మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, కోనేరు కోనప్ప, పద్మాదేవేందర్‌రెడ్డి, గాదరి కిశోర్, సైదిరెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావు, సంజయ్‌కుమార్, ఆరూరి రమేశ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, నోముల భగత్, చింత ప్రభాకర్, గండ్ర వెంకటరమణారెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఎన్ దివాకర్‌రావు, గూడెం మహిపాల్‌రెడ్డి, బాల్క సుమన్, చల్మెడ లక్ష్మీ నరసింహరావు తదితరులు నామినేషన్లు వేశారు.

నేడు నామినేషన్ దాఖలు..

వరంగల్ పశ్చిమ, ములుగు, ఆలేరు, హుజూరాబాద్, నాగర్ కర్నూలు, కొల్లాపూర్, గద్వాల, మహేశ్వరం, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గ అభ్యర్థులు శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు.

వీల్‌చైర్‌లో వచ్చి కొత్త ప్రభాకర్‌రెడ్డి నామినేషన్

ఇటీవల కత్తిపోట్లకు గురై హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గురువారం దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అంబులెన్స్‌లో వచ్చారు. ఆయనను అంబులెన్స్ నుంచి వీల్‌చైర్‌పై మంత్రి హరీశ్‌రావు పట్టుకుని కేంద్రానికి తీసుకెళ్లారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి కొత్త ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ పత్రాలను అందజేశారు. అంబులెన్స్‌లో వచ్చిన ఎంపీని చూసిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు, మంత్రి హరీశ్‌రావు భావోద్వేగానికి గురయ్యారు. మంచి మనిషికి ఇలాంటి పరిస్థితి వచ్చిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అధైర్యపడవద్దని, మేమంతా అండగా ఉంటామని ఎంపీకి ధైర్యం చెప్పారు. ఎంపీని చూడటానికి నియోజకవర్గం నలుమూలల నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీ ర్యాలీ దుబ్బాకకు వచ్చారు. అనంతరం ఎంపీ అంబులెన్స్‌లో తిరిగి వెళ్లారు.

కాంగ్రెస్ చెప్తున్నట్టు 3 గంటలు చాలా?

మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్ గెలుపును ఏ శక్తీ అడ్డుకోలేదని, బీఆర్ఎస్ గెలుపు ఖాయమైందని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు కష్టాలు మళ్లీ మొదలవుతాయని, కాబట్టి రిస్క్ తీసుకోవద్దని ఓటర్లకు సూచించారు.

కుక్కలు చింపిన విస్తరి కావొద్దు

కాంగ్రెస్ పార్టీ టికెట్లను తక్కెట్లో పెట్టి అర్రాస్ పాట లెక్క అమ్ముకొంటున్నదని మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రం వీళ్ల చేతుల్లోకి వెళ్తే కుక్కలు చింపిన విస్తరి అయిపోతుందని హెచ్చరించారు. సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే ఉన్నాయని, ఎవరెన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు కేసీఆర్‌ను, గులాబీ జెండానే నమ్ముతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాకుంటే కాళేశ్వరం వచ్చేది కాదని, 24 గంటల కరెంట్ ఉండేది కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ రైతుబంధును అవమానిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసం సీఎం కేసీఆర్ మరోమారు అద్భుతమైన మ్యానిఫెస్టోను తయారుచేశారని ప్రశంసించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు గడపగడపకు వెళ్లి మ్యానిఫెస్టోను వివరించాలని కోరారు. ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేసే బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ కార్యకర్త కథానాయకుడు కావాలని, దుబ్బాకలో కొత్త ప్రభాకర్‌రెడ్డిని 50 వేల మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

గల్లీలో ఉండరు.. ఢిల్లీ నుంచి వస్తారు

ఎన్నికలు ఉండడంతో కాంగ్రెస్, బీజేపీ నేతలు, మంత్రులు ఢిల్లీ నుంచి, కర్ణాటక నుంచి వచ్చి తెలంగాణను చుట్టముడుతున్నారని, ఎన్నికలు ముగిసిన మరుక్షణం వారందరూ మాయమైపోతారని విమర్శించారు. ప్రజల కష్టాసుఖాల్లో పాలు పంచుకొనేది బీఆర్ఎస్ నేతలు మాత్రమే పేర్కొన్నారు. బీఆర్ఎస్ సర్కారు మాత్రమే తెలంగాణ ప్రజల వైపు ఉంటుందని, ప్రతిపక్షాల మోసపూరిత మాటలు విని మోసపోవద్దని, కారుగుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి హరీశ్‌రావు కోరారు.

కాంగ్రెస్‌లో మరో ముఖ్యమంత్రి అభ్యర్థి!

- సీఎం పదవిపై ఎమ్మెల్యే సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): ఆలు లేదు.. చూలు లేదు.. కొడుకు పేరు సోమలింగం అన్న చందంగా మారింది కాంగ్రెస్ పరిస్థితి. ఆ పార్టీలో రోజుకో సీఎం అభ్యర్థి పుట్టుకొస్తున్నారు. ఇప్పటికే జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భట్టి విక్రమార్క, జగ్గారెడ్డి, మధు యాష్కీ తదితరులు తాము సీఎం రేసులో ఉన్నామని ప్రకటించుకున్నారు. అదే జాబితాలో తాజాగా మరొకరు చేరిపోయారు. సీఎం పదవిపై ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గురువారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ వచ్చి హైకమాండ్ ఆదేశిస్తే సీఎం పదవి చేపడతానని ఆమె తన మనసులోని మాట బయటపెట్టారు. దీంతో కార్తకర్తల్లో అయోమయం నెలకొన్నది. గెలువక ముందే.. మేమంటే.. మేము సీఎంలమంటూ.. డాంబికాలకు పోయి అసలు ప్రచారాన్ని వదిలేస్తున్నారని వాపోతున్నారు.

కాంగ్రెస్ డీఎన్ఏలోనే బీసీ వ్యతిరేకభావం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్, నవంబర్9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ బీసీలను నమ్మించి మోసగించిందని, ఆ పార్టీ డీఎన్ఏలోనే బీసీ వ్యతిరేకభావం ఉన్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 34 సీట్లు కేటాయిస్తామని ఊదరగొట్టిన ఆ పార్టీ, ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీ కంటే తక్కువ సీట్లు కేటాయించి ఆ హామీనే తుంగలో తొక్కిందని ధ్వజమెత్తారు. ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో బీసీలకు రెండు సీట్లు కేటాయిస్తామని ఆ పార్టీ తీర్మానం చేసిందని, చివరకు 23 సీట్లే ఇచ్చిందని పేర్కొన్నారు. డిపాజిట్ కూడా రాని పాతబస్తీలోని ఐదు సీట్లను కేటాయించి బీసీలను అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌నే అమలు చేయని కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. రెండోరోజుల్లో బీసీల భవిష్యత్తు రాజకీయ కార్యాచరణను ప్రటిస్తామని, బీసీలకు ద్రోహులెవరో, దొంగలెవరో తేల్చుతామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌లో ఆగని అసమ్మతి జ్వాలలు

- పోటాపోటీగా నామినేషన్లు దాఖలు
- కాంగ్రెస్‌కు తలనొప్పిగా అసమ్మతి
- అభ్యర్థులను ప్రకటించని స్థానాల్లోనూ పోటాపోటీగా నామినేషన్ల సమర్పణ
- మరో 5 స్థానాలకు అభ్యర్థుల ఖరారు

హైదరాబాద్/న్యూస్‌నెట్‌వర్క్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): నామినేషన్ల దాఖలుకు గడువు ముగుస్తున్నా కాంగ్రెస్‌లో మాత్రం ప్రతిష్ఠంభన తొలగడం లేదు. ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థులపై క్షేత్రస్థాయిలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. మిర్యాలగూడ, సూర్యాపేట, చార్మినార్, తుంగతుర్తి, పటాన్‌చెరు స్థానాలకు గురువారం రాత్రి అధిష్ఠానం అభ్యర్థులను ఖరారు చేసింది. అయితే అంతకుముందే ఆశావహులు ఎవరికి వారు నామినేషన్లు వేయడంతో కార్యకర్తల్లో గందరగోళం నెలకొన్నది. సూర్యాపేట నుంచి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి నామినేషన్లు వేశారు. సూర్యాపేట టికెట్ వ్యవహారం కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారింది. పటేల్ రమేశ్‌రెడ్డి, ఆర్ దామోదర్‌రెడ్డి ఇద్దరూ పార్టీకి కావాల్సిన వారే. ఎవరికి టికెట్ ఇచ్చినా మరొకరు మద్దతు ఇచ్చే పరిస్థితి లేదు. మద్దతు లేకుంటే ఎవరికి టికెట్ ఇచ్చినా కాంగ్రెస్ గెలిచే అవకాశం లేదని పీసీసీ భావిస్తున్నది. ఈ క్రమంలో గురువారం రాత్రి విడుదల చేసిన జాబితాలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. నర్సాపూర్‌లో అభ్యర్థిగా నర్సారెడ్డి నామినేషన్ దాఖలు చేయగా.. పీసీసీ నాయకుడు మనోహర్‌రెడ్డి కూడా వేశారు. మిర్యాలగూడ అభ్యర్థిని ప్రకటించలేదు. గురువారం ఉదయం బత్తుల లక్ష్మారెడ్డి నామినేషన్ వేయగా రాత్రి ఆయన పేరును అధిష్ఠానం ప్రకటించింది. బాన్సువాడ కాంగ్రెస్ నాయకుడు బాలరాజు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో అక్కడ పరిస్థితిని చక్కబెట్టేందుకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ రంగంలోకి దిగారు. నర్సాపూర్‌లో గాలి అనిల్‌కుమార్‌కు బదులు రాజిరెడ్డికి టికెట్ ఇవ్వడంతో అనిల్‌కుమార్ ఇప్పటికే నామినేషన్ వేశారు. ఈ విషయాన్ని పార్టీ దృష్టికి తీసుకెళ్లడంతో చర్చించారు. మహేశ్వరంలో పారిజాత నర్సింహారెడ్డి స్థానంలో కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి టికెట్ ఇచ్చారు. దీంతో ఇరువురు నేతలు నామినేషన్లు దాఖలు చేశారు. తనకే పార్టీ బీఫామ్ ఇవ్వాలని పారిజాత నర్సింహారెడ్డి డిమాండ్ చేస్తున్నారు. వనపర్తి టికెట్ దక్కకపోవడంపై మాజీ మంత్రి చిన్నారెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. టికెట్ ఆశించి భంగపడ్డ ఆదిలాబాద్ కాంగ్రెస్ నేతలు సాజిద్‌ఖాన్, గండ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. గురువారం వారు ఆదిలాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకొన్న రాజకీయ బ్రోకర్ అని మండిపడ్డారు. తుపాకీ, కత్తులు లేకుండా హత్యలు చేసే వ్యక్తి రేవంత్ అని ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు, సర్పంచ్ నూనావత్ రమేశ్ మహబూబాబాద్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. వరంగల్ పశ్చిమ నుంచి జంగా రాఘవరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ తరపున ఒకటి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) నుంచి సింహం గుర్తుపై మరొకటి, మొత్తం రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎల్ రమేశ్‌కు అందజేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనకు బీ-ఫాం ఇస్తుందన్న నమ్మకం ఉన్నదని తెలిపారు.

ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు సాజిద్‌ఖాన్, గండ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డి

తుంగతుర్తిలోనూ తీవ్ర అసంతృప్తి..

తుంగతుర్తి టికెట్ విషయంలోనూ పార్టీలో తీవ్ర అసంతృప్తి రేగింది. ఇక్కడ దాదాపు 20 మంది అభ్యర్థులు టికెట్ ఆశిస్తున్నారు. టికెట్ తనకే వస్తుందని కొన్నాళ్లుగా సీనియర్ నేత అద్దంకి దయాకర్ ప్రచారం చేసుకుంటున్నారు. మరోవైపు ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి, కాంగ్రెస్‌లో చేరిన మోత్కుపల్లి నర్సింహులు కూడా టికెట్ ఆశించారు. రాష్ట్ర కార్యాలయంతోపాటు బెంగళూరు, ఢిల్లీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కానీ చివరికి బీఆర్ఎస్ నుంచి వచ్చిన మాజీ ఎమ్మెల్యే మందుల సామేల్‌కు టికెట్ కేటాయించారు. దీంతో అద్దంకి దయాకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ మారినా ఫలితం లేదంటూ మోత్కుపల్లి నర్సింలు తన సన్నిహితుల దగ్గర వాపోతున్నారు.

నేతల తీరుపై ప్రధానకార్యదర్శి ఆగ్రహం

కాంగ్రెస్‌లో నెలకొన్న ప్రతిష్ఠంభనపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రచారంలో అనుసరిస్తున్న తీరుపైనా ఆయన రాష్ట్ర నాయకులపై మండిపడినట్టు సమాచారం. ప్రచారం తీరు సక్రమంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని హెచ్చరించినట్టు పార్టీ వర్గాలు వెల్లడించారు. ప్రతిష్ఠంభన నెలకొన్న నియోజకవర్గ అభ్యర్థులకు సంబంధించి తుది నిర్ణయం తీసుకునేందుకు కేసీ వేణుగోపాల్ రంగంలోకి దిగారు. పార్టీ ముఖ్యనేతలతో గురువారం రాత్రి హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ప్రకటించాల్సిన నాలుగు నియోజకవర్గాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సూర్యాపేట, తుంగతుర్తి, మిర్యాలగూడ, చార్మినార్ నియోజకవర్గాలకు సంబంధించి సర్వే నివేదికలు తెప్పించుకొని తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం.

అత్త స్థానంలో కోడలు..

పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఆది నుంచి వివాదాలతో నడుస్తున్నది. తొలుత అత్త వచ్చిం ది. తర్వాత కోడలు వచ్చింది. అత్తకు పౌరస త్వం లేకపోవడంతో చివరికి సీటు కోడలికి దక్కింది. కొడలి వారసత్వం ఓటు మీద అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. చివరికి కోడలు యశస్వినీరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆమె నామినేషన్‌పై ఆర్వో పలు ప్రశ్నలు అడిగారు. ఓటు హక్కు సర్టిఫైడ్ కాపీ ఒరిజినల్ కావాలని సూచించారు. పార్టీ ఏ ఫాం, బీ ఫాంలు 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయాలని ఆదేశించారు. పరిశీలనలో యశస్విని నామినేషన్ ఉంటుందా, తిరస్కరణకు గురవుతుందా? అనే చర్చలు నడుస్తున్నాయి.

కార్యాలయాన్ని ధ్వంసం చేసినందుకు టికెట్

కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు అభ్యర్థిని మార్చింది. నీలం మధు ముదిరాజ్ స్థానంలో కాట శ్రీనివాస్‌గౌడ్‌కు టికెట్‌ను కేటాయించింది. కాట శ్రీనివాస్‌గౌడ్‌కు మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, నీలం మధుకు సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి మద్దతుగా నిలిచారు. వాస్తవానికి నీలం మధుకు టికెట్ ఇస్తామని చెప్పడంతోనే ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల విడుదల చేసిన మూడో జాబితాలో నీలం మధు పేరు ప్రకటించారు. కాట శ్రీనివాస్‌గౌడ్‌కు టికెట్ దక్కకపోవడంతో ఆయన అనుచరులు పార్టీ కార్యాలయంపై దాడి చేసి రేవంత్ ఫ్లెక్సీలను, ఫొటోలను చింపి తగులబెట్టారు. బుధవారం నీలం మధు, శ్రీనివాస్‌గౌడ్ పోటాపోటీగా నామినేషన్లు వేశారు. దీంతో పార్టీ టికెట్ తమకేనని ఇద్దరూ చెప్పుకొచ్చారు. చివరకు గురువారం రాత్రి ప్రకటించిన జాబితాలో శ్రీనివాస్‌గౌడ్ పేరును ఖరారు చేశారు. 'పార్టీ కార్యాలయంపై దాడి చేసి, ఫొటోలు తగులబెడితే టికెట్లు ఇస్తారా?' అంటూ కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతున్నది.

ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఇంటి ఎదుట గుమిగూడిన ప్రజలు

కాంగ్రెస్‌లో పైసల పంచాయితీ

ఆదిలాబాద్‌లో రేవంత్ సభకొచ్చిన జనం లొల్లి

ఆసిఫాబాద్/ ఆదిలాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): ఆసిఫాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్ ఇంటి ఎదుట గురువారం రాత్రి డబ్బుల కోసం పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ అభ్యర్థిగా శ్యాంనాయక్ నామినేషన్ కార్యక్రమానికి వివిధ మండలాల నుంచి ప్రజలను ఆసిఫాబాద్‌కు తరలించారు. భోజనాలు పెట్టి డబ్బులు ఇస్తామని తీసుకొచ్చారు. అయితే.. రాత్రి 9 గంటలు అవుతున్నా.. తమకు ఇంకా డబ్బులు ఇవ్వలేదని ఆరోపిస్తూ కొందరు శ్యాంనాయక్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. భోజనం కూడా పెట్టలేదని ఆరోపించారు. ఆదిలాబాద్ అభ్యర్థి కందిశ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా డైట్ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరుకావడంతో.. డబ్బులు ఇస్తామని జనాలను తరలించారు. మధ్యాహ్నం 3:30 గంటలకు సభ ముగిసింది. సభ ముగిసినా తమకు ముందుగా చెప్పిన విధంగా డబ్బులు ఇవ్వడం లేదని కాంగ్రెస్ అభ్యర్థి ఇంటి ఎదుట భారీ సంఖ్యలో ఆందోళనకు దిగారు. డబ్బులు ఎందుకివ్వరని వారిని నిలదీశారు.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

పోస్టల్ శాఖలో..

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ పోస్టల్ సర్కిల్స్‌లో ఖాళీగా ఉన్న గ్రూప్ సీ పోస్టుల భర్తీకి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ ప్రకటన విడుదల చేసింది.

- మొత్తం ఖాళీలు: 1899
- వీటిలో తెలంగాణ-91, ఏపీ-51 ఖాళీలు ఉన్నాయి.
- పోస్టులు: పోస్టల్ అసిస్టెంట్, సార్టింగ్ అసిస్టెంట్, పోస్ట్‌మ్యాన్. మెయిల్ గార్డ్, ఎంటీఎస్
- అర్హతలు: పదోతరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత. వివిధ స్థాయుల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులై ఉండాలి.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 9
- వెబ్‌సైట్: https://www.indiapost.gov.in

ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులు

నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీలో కింది కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.

- కోర్సులు: బీఎస్సీ, ఎల్ఎల్‌బీ ఆనర్స్- డేటా సైన్స్ అండ్ లా, బీబీఏ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం (సైబర్ లా అండ్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్), ఎల్ఎల్ఎం (క్రిమినల్ లా అండ్ క్రిమినల్ జస్టిస్)
- అర్హతలు, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 31
- వెబ్‌సైట్: www.nfsu.ac.in

గెయిల్‌లో..

గెయిల్ (ఇండియా) లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 12
- పోస్టులు: చీఫ్ మేనేజర్ (హెచ్ఆర్)
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 30
- వెబ్‌సైట్: https://gailonline.com

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- సైన్స్ & మెథడాలజీ, జనరల్ స్టడీస్ (గ్రూప్స్, డీఎస్సీ) పీఐఈ & ఐసీటీ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండ